సాక్షి
కామారెడ్డి

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



యూరియా కష్టాలు

జిల్లాలోని పలు ప్రాంతాలలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. రైతులు బస్తా ఎరువు కోసం అష్టకష్టాలు పడుతున్నారు.

- 9లో ▸



పేదలను ఆదుకుంటాం

ఇటీవల కురిసిన వర్షాలతో ఇబ్బందిపడ్డ పేదలను ఆదుకుంటామని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ పేర్కొన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /22.2

ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీక్షణంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

విద్యుత్ సేవలకోసం వాట్సాప్ చేయండి

కామారెడ్డి అర్బన్: తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతున్నా, మీటరు సమస్య ఉన్నా ఎన్పీడీసీఎల్ వాట్సాప్ నంబర్ 79016 28348 కు ఫిర్యాదు చేయాలని ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మీటర్ సర్వీస్ నంబర్ ఆధారంగా హాయ్ చెప్పి, సమస్యపై ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఇది అందుబాటులో ఉందని తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు సాహసోపేతమైన నిర్ణయం



నాగిరెడ్డిపేట: జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడి ఎల్లారెడ్డి పేర్కొన్నారు. నాగిరెడ్డిపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీని తగ్గించడం వల్ల నిత్యావసర సరుకులతోపాటు ఔషధ రేట్లు తగ్గుతాయన్నారు. ఈ నిర్ణయం వల్ల 140 కోట్ల మంది భారతీయులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు హన్మాండ్లు, దేవిసింగ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి-మెదక్ మధ్య రాకపోకలు పునఃప్రారంభం



నాగిరెడ్డిపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామ శివారులో జాతీయ రహదారి తెగిపోయింది. దీంతో కామారెడ్డి – మెదక్ జిల్లాల మధ్య వారం రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంతలను హైవే పనులు చేస్తున్న కేపీసీ సంస్థ ఆధ్వర్యంలో పూడ్చివేశారు. తాత్కాలిక మరమ్మతులు పూర్తి కావడంతో గురువారం రాకపోకలను పునఃప్రారంభం అయ్యాయి.

7న స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల సమావేశం

కామారెడ్డి అర్బన్: స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ వార్షిక కౌన్సిల్ సమావేశం, ఎన్నికలను ఈనెల 7న నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు కామారెడ్డి కర్షక్ బీఈడీ కళాశాలలో సమావేశం ఉంటుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతురెడ్డి, విజయ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సమస్యలపై రాష్ట్ర ప్రతినిధుల సందేశాల అనంతరం నూతన కమిటీ ఎన్నికలుంటాయని వారు పేర్కొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వేదికపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు కేవీఆర్, లక్ష్మీకాంతారావు, సుదర్శన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర

అండగా ఉంటా

"ఎన్నడూ లేనంత వరదలతో వాటిల్లిన ఇబ్బందులను చూసి ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే ఇక్కడిదాకా వచ్చా. మీకు జరిగిన నష్టాన్ని చూశా. మళ్లీ ఇలాంటి సమస్య ఎదురు కావొద్దు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. అందుకోసం అవసరమైన నిధులు ఇస్తా. అధైర్యపడకండి అండగా ఉంటా'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లో పర్యటించిన సీఎం.. వరదలతో దెబ్బతిన్న పంటలు, వంతెనలు, ఇళ్లను పరిశీలించారు. బాధితులను కలిసి వారి గోడును విన్నారు. "మీ కష్టాలు తీర్చడానికే వచ్చా''నంటూ వారికి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్/ లింగంపేట



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా జిల్లాలో వరద నష్టం గురించి సీఎంకు వివరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్



- జీఆర్ కాలనీ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం
- నష్టపోయిన రైతులను ఆదుకుంటాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- లింగంపల్లి కుర్దు, బూరుగిద్ద, కామారెడ్డిలలో పర్యటన
- వరదలతో దెబ్బతిన్న పంటలు, వంతెన, రోడ్ల పరిశీలన
- బాధితులను ఆదుకుంటామని హామీ

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలు, వచ్చిన వరదలతో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌నుంచి హెలీకాప్టర్ ద్వారా జిల్లాకు చేరుకున్నారు. లింగంపేట మండలంతోపాటు కామారెడ్డి పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధికారులందరూ సమన్వయంతో ముందుకువెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదన్నారు. వరదలు వచ్చిన రోజునే మంత్రి సీతక్క, ఎంపీ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీలకు ఫోన్ చేసి బాధితులకు అండగా ఉండాలని సూచించానన్నారు. వరద సహాయక చర్యల్లో కామారెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు కృషి చేశారన్నారు. వరదల్లో పిల్లల పుస్తకాలు తడిచిపోయాయని చెప్పారని, కాంటింజెన్సీ ఫండ్ నుంచి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అలాగే ఫార్మా కంపెనీలు, బీడీ పరిశ్రమలతో మాట్లాడి వారి సహకారంతో కాలనీవాసులను ఆదుకోవాలని కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. "కంపెనీలు ఇచ్చే సాయం తీసుకోండి, ఇంకా ఏది కావాలన్నా నేను ఇస్తా'' అని సీఎం అన్నారు.

కొడంగల్ లెక్కనే అభివృద్ధి జేస్త..

"ఎన్నికల సమయంలో చెప్పినట్లే కొడంగల్‌తో సమానంగా కామారెడ్డిని చూస్తా.. అభివృద్ధి చేస్తా. ఏ సమస్య ఉన్నా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకురండి. ఆయన సహకారంతో కామారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు ఇస్తా. కామారెడ్డిలో ఏ కష్టమొచ్చినా ఆదుకునే బాధ్యత నాది'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సంగ్వాన్

ఒక్కో శాఖపై సుదీర్ఘంగా సమీక్ష

కలెక్టరేట్‌లో అధికారులతో సీఎం దాదాపు గంటన్నర పాటు సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో మొదట ఫొటో ప్రదర్శనను తిలకించిన అనంతరం భోజనం చేశారు. అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వరదలతో జరిగిన నష్టం, చేసిన పనిని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్, ఎన్పీడీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యారోగ్యశాఖ, వ్యవసాయం, నీటి పారుదల శాఖలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఆయా శాఖల అధికారులు చెప్పిన అంశాలను విని, వాటిపై పలు ప్రశ్నలు అడిగారు. యూరియాకు సంబంధించి అధికారుల మధ్య సమన్వయం అవసరం అన్నారు. ఒకేచోట పంపిణీ చేపట్టడం వల్ల వేలాది మంది రైతులు రావడం, తోపులాటలు, ఇబ్బందులు ఏర్పడి ప్రభుత్వం బద్నాం అవుతోందన్నారు. అలా కాకుండా రెండు మూడు గ్రామాలకు కలిపి ఒకచోట పంపిణీ చేస్తే ఇలాంటి సమస్యలు రావన్నారు.

సీఎం పర్యటన సాగిందిలా..

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టర్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావులతో కలిసి ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చేరుకుని, వివిధ ప్రాంతాల్లో ఏరియల్ వ్యూ నిర్వహించారు. అనంతరం తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ శివారులో హెలిప్యాడ్ వద్ద దిగారు. ఆయనకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

బస్సులో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి లింగంపేట మండలంలోని లింగంపల్లి కుర్దు గ్రామ శివారులో కేకేవై రోడ్డుపై వరదలతో తెగిపోయిన వంతెనను పరిశీలించారు. అనంతరం బూరుగిద్ద గ్రామ శివారులో వరదలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి జరిగిన నష్టాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. బూరుగిద్ద గ్రామస్తులు, పిల్లలతోనూ ఆయన మాట్లాడి అక్కడి నుంచి బస్సులో కామారెడ్డి పట్టణానికి చేరుకున్నారు. వరద ముంపునకు గురైన జీఆర్ కాలనీలో పర్యటించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడారు.

భోజన నాణ్యతపై యాప్‌ను వాడుకోండి

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పెట్టే భోజనం నాణ్యత తెలుసుకునేందుకు యాప్ ఉందని, దాని ద్వారా ఫొటో తీస్తే అందులో న్యూట్రిషన్ ఏమేరకు ఉందో తెలిసిపోతుందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. క్షేత్ర స్థాయిలో నాణ్యతను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్పత్రుల్లో రోగులకు పెట్టే భోజనానికి కూడా యాప్‌ను వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు చందర్, విక్టర్, నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు ఇంద్రకరణ్‌రెడ్డి, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇందుప్రియ పాల్గొన్నారు.



జీఆర్ కాలనీలో వరద బాధితురాలితో మాట్లాడుతున్న సీఎం

వందేళ్ల కింద నిర్మించినా..

పోచారం ప్రాజెక్టును 103 ఏళ్ల కింద రూ. 26 లక్షలతో నిర్మించినా అది ఇంతటి వరదలను తట్టుకుని నిలబడడం మజ్‌బూత్‌గా ఉందని సీఎం పేర్కొన్నారు. జిల్లాలో వరదలతో దెబ్బతిన్న చెరువులు, కుంటలు, రోడ్లకు మరమ్మతులు చేయిస్తానన్నారు. వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని పేర్కొన్నారు. "మంచిగా ఉన్నపుడు కాదు, కష్టం వచ్చినపుడు వెన్నంటి నిలబడేవాడే నాయకుడు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వరదల సమయంలో ప్రజలకు అండగా నిలిచారు'' అంటూ అభినందించారు. విపత్తులు తలెత్తినపుడు అందరూ మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. బాధితులకు భరోసా ఇవ్వడం, వారిని కాపాడుకోవడానికి ఎవరి స్థాయిలో వారు ప్రయత్నించాలన్నారు.



జిల్లాకేంద్రంలో బాధితుల గోడు వింటున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు ఉత్తమ టీచర్లుగా ఎంపికయ్యారు. ఇందులో రాజంపేట మండలం పొందుర్తి యూపీఎస్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న స్వామి, గాంధారి మండలం ప్రైమరీ స్కూల్ టీచర్ భూంపల్లి భవాని, కామారెడ్డిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ సురేశ్ రాథోడ్ ఉన్నారు. – కామారెడ్డిటౌన్/గాంధారి

సులభ పద్ధతుల్లో బోధిస్తూ..

గాంధారిలోని బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బి.భవాని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఆమె ఈ పాఠశాలకు 2018 లో టీచర్‌గా వచ్చారు. అప్పట్లో 40 మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారు. అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులకు చక్కగా పాఠాలు చెబుతుండడంతో క్రమంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. బొమ్మలు, డ్రాయింగ్, ఆటలు, పాటలతో పాఠాలు బోధిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అబాకస్ కూడా నేర్పిస్తున్నారు. కోవిడ్ వ్యాప్తి కాలంలో భరత నాట్యం, కర్ణాటక సంగీతం నేర్చుకున్న ఆమె.. విద్యార్థులకు నేర్పిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు చెబుతూ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె కృషితో ప్రస్తుతం ఈ స్కూల్‌లో 140 మంది విద్యార్థులున్నారు. ప్రజాప్రతినిధుల పిల్లలూ ఇక్కడ చదువుతున్నారు. ప్రభుత్వం బెస్ట్ టీచర్‌గా ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు.



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న భవాని

డెయిరీ కళాశాల డీన్‌కు..



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ సురేశ్ రాథోడ్ రాష్ట్రస్థాయి బెస్ట్ టీచర్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు ఉన్నత విద్యాశాఖ గురువారం ఆయనకు సమాచారం అందించింది. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం రాజులగూడకు చెందిన సురేశ్ రాథోడ్ 2004 సంవత్సరంలో ఉద్యోగంలో చేరారు. వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలోని కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేశారు. బెస్ట్ టీచర్‌గా ఎంపికైన సురేశ్ రాథోడ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

మూత'బడి'ని తెరిపించి..

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఎం.స్వామి 2019 నుంచి 2024 వరకు భిక్కనూరు మండలం శివాయిపల్లిలో ఎస్‌జీటీగా పనిచేశారు. ఆయన ఈ పాఠశాలకు రాకముందు బడి మూతబడింది. తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు బడిలో చేర్పించేలా చూశారు. తన ఇద్దరు కూతుళ్లను సైతం ఇదే బడిలో చేర్పించి చదివించారు. కూతురు లాస్యశ్రీ ఐదో తరగతివరకు ఇక్కడే చదివి ఆరో తరగతికి నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యింది. కుమారుడు దివిత్ ఐదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. ప్రస్తుతం ఏడో తరగతి ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నాడు. ఆయన పనిచేసిన సమయంలో ఈ పాఠశాల విద్యార్థులు 60 మంది నవోదయకు ఎంపికవడం గమనార్హం. ప్రస్తుతం రాజంపేట మండలంలోని పొందుర్తిలో పనిచేస్తున్న ఆయనను రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులకు పాఠం చెబుతున్న స్వామి

నేడే నిమజ్జనోత్సవం ప్రారంభం

- జిల్లా కేంద్రంలో భారీ శోభాయాత్రకు ఏర్పాట్లు
- జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్న జనం

కామారెడ్డి టౌన్: వినాయక చవితి పండుగతో ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరాయి. నవరాత్రులు ఘనమైన పూజలందుకున్న గణపయ్య.. శుక్రవారం గంగమ్మ ఒడిని చేరుకునేందుకు పయనమవనున్నాడు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిమజ్జన శోభాయాత్ర ప్రారంభం కానుంది. శనివారం కూడా కొనసాగనుంది. శోభాయాత్రతోపాటు విగ్రహాల నిమజ్జనానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా కేంద్రంలో 400లకు పైగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. శోభాయాత్ర ఘనంగా జరుగుతుంది. దీనిని తిలకించడానికి పట్టణవాసులే కాకుండా జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. టేక్రియాల్ చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శోభాయాత్ర సాగుతుందిలా..

సిరిసిల్ల రోడ్‌లోని ధర్మశాల వద్ద శుక్రవారం సాయంత్రం శోభాయాత్ర ప్రారంభం కానుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర పాల్గొంటారు. శోభాయాత్ర సబంధించిన రూట్ మ్యాప్‌ను అధికారులు విడుదల చేశారు. రైల్వే స్టేషన్‌లోని యువజన సమాఖ్య వినాయకుడి నిమజ్జన శోభాయాత్ర ధర్మశాల వద్ద ప్రారంభం అవుతుంది. అక్కడి నుంచి సిరిసిల్లరోడ్ మీదుగా ఇందిరాచౌక్ వద్దకు చేరుకుంటుంది. అక్కడ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద మండపాల నిర్వాహకులను సన్మానిస్తారు. అక్కడి నుంచి స్టేషన్‌రోడ్, సుభాష్‌రోడ్, తిలక్‌రోడ్, జేపీఎన్ చౌరస్తా, వీక్లీమార్కెట్ రోడ్, పాంచ్‌రస్తా, గోపాలస్వామిరోడ్, పెద్ద బజార్, రైల్వేబ్రిడ్జి, అంబేడ్కర్ విగ్రహం, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా టేక్రియాల్ చెరువు వరకు శోభాయాత్ర కొనసాగుతుంది. చెరువుల్లో వినాయకులను నిమజ్జనం చేస్తారు. కొందరు విగ్రహాలను బాసరకు తీసుకెళ్తారు.



టేక్రియాల్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు

చెరువు వద్ద..

టేక్రియాల్ చెరువు వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మూడు భారీ క్రెయిన్‌లు, డోజర్‌ను ఏర్పాటు చేశారు. విగ్రహాలను ఈ క్రేన్ ద్వారా చెరువుల్లో వేసి నిమజ్జనం చేస్తారు. చెరువులోకి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. చెరువు వద్ద సహాయక కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. ఎస్పీ ఆధ్వర్యంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, సీఆర్‌పీఎఫ్, హోంగార్డులు, పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ అధికారులు శోభాయాత్రను పర్యవేక్షించనున్నారు. ప్రశాంతంగా శోభాయాత్ర, నిమజ్జనం జరుపుకోవాలని అధికారులు మండపాల నిర్వాహకులను కోరారు.

క్లుప్తంగా

కళా ఉత్సవ్‌కి ఎంపికైన విద్యార్థులు



బీబీపేట: కళా ఉత్సవ్– 2025లో భాగంగా గురువారం జిల్లా స్థాయిలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీలలో మండల కేంద్రంలోని టీఎస్ఎస్ఆర్ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన అఖిల్, పూర్ణచందన, ఇందు, దయానంద్, శివమణి, హర్షన్,తేజ,అఖిల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి లో ఆడుతారని ప్రధానోపాధ్యాయుడు రవీంద్రా రెడ్డి తెలిపారు.ఉపాధ్యాయులు విశ్వ మోహన్,నాగరాజు,రాధిక తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల అరెస్టు సరికాదు



ఎల్లారెడ్డి: రేషన్ డీలర్లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సురేందర్ అన్నారు. గురువారం జిల్లాలో సీఎం పర్యటన సందర్భంగా రేషన్ డీలర్లను ముందస్తుగా అరెస్టు చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు. రేషన్ డీలర్ల 5 నెలల కమీషన్‌ను, రూ. 5 వేల గౌరవ వేతనం అందించాలని కోరారు. డీలర్లు చంద్రయ్య, శ్రీనివాస్, ఆగమయ్య, విఠల్ తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డులను పొందాలి



ఎల్లారెడ్డిరూరల్: భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డులను పొందాలని జిల్లా సీఎస్‌సీ హెల్త్ సెంటర్ మేనేజర్ ప్రవీణ్ నాయక్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు ఆవశ్యకత గురించి వివరించారు. లేబర్ కార్డు వల్ల ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. నాయకులు రజాక్ తదితరులున్నారు.

ఇబ్బందిపడ్డ వాహనదారులు



తాడ్వాయి: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఎర్రాపహాడ్ శివారులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద మోతె రోడ్డులో వాహనాలను పోలీసులు నిలిపివేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్ నుంచి దిగి రోడ్డు మార్గంలో లింగంపేట్ మండలానికి వెళ్లే వరకు వాహనాలను నిలిపివేశారు. అనంతరం లింగంపేట్ మండలం నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లే వరకు తాడ్వాయి, ఎర్రాపహాడ్, కృష్ణాజీవాడిలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలోనూ వాహనాలను నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ, బీఎడ్, ఎంఎడ్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా కొనసాగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పీజీ 8, 10వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 45 మంది విద్యార్థులకు గానూ 44 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. బీఎడ్, 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 46 మంది విద్యార్థులకు గానూ 33 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే ఎంఎడ్ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 1,2 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 33 మంది విద్యార్థులకు గానూ 31 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

మాది ప్రజా ప్రభుత్వం



సీఎం పర్యటనలో వరద బాధితులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కామారెడ్డి టౌన్: మాది ప్రజా ప్రభుత్వమని, వరదల రోజున అనివార్య కారణాలతో సీఎం రాలేకపోయారని, పట్టు వదలకుండా మళ్లీ కామారెడ్డికి వచ్చి నేరుగా ప్రజల బాధలు తెలుసుకుని సహాయం చేయడానికి వచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో ఇటీవల వరద ముంపునకు గురైన జీఆర్ కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఆమె గురువారం పర్యటించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటే ప్రజాపాలన ప్రభుత్వం , వరదల్లో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు మేమంతా ముందుంటామన్నారు. వరదలు వచ్చిన మరుసటి రోజునే ఎంపీ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీలతో ఇక్కడ బాధితుల బాధలను తెలుసుకుని సీఎం గారికి వివరించామన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



కామారెడ్డిలో వరదలకు లోతట్టు కాలనీలో మునిగిపోయి ఇబ్బందులతో ఉన్నప్పుడు ప్రజలకు ఆదుకునేందుకు రాజకీయాలకు అతీతంగా నేతలు, అన్ని శాఖల అధికారులు వర్షాల్లో తడుస్తూ 48 గంటల పాటు విధులు నిర్వహించి ప్రజలు ఇబ్బందులను తొలగించేందుకు తీవ్రంగా కష్టపడ్డారు. వారందరికి కృతజ్ఞతలు. కామారెడ్డి ప్రజలకు ఆత్మస్థైర్యం నింపేందుకు వచ్చిన సీఎంకు కృతజ్ఞతలు. మళ్లీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సీఎంను విజ్ఞప్తి చేస్తున్నా. అవసరమైన నిధులు మంజూరు చేయాలి.

– వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే

ప్రజలకు అండగా ఉంటాం



కామారెడ్డిలో వరదలు రాగానే స్వ యంగా సీఎం వెంటనే అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేసి ప్రజల కష్టాలను ఆదుకున్నారు. మేం కూడా పర్యటించి ప్రజల బాధలను సీఎంకు వివరించాం. ముఖ్యంగా ఆపదలో ఉన్న ప్రజల్ని ఆదుకునేందుకు కృషి చేసిన జిల్లా అధికార యంత్రాంగానికి అభినందనలు. వాతావరణం సహకరించకపోవడంతో ఆ రోజున సీఎం రాలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం, మేమంతా ప్రజలకు అండగా ఉంటాం.

– సురేష్ షెట్కార్, ఎంపీ

ఎవరికి కష్టమొచ్చినా ఆదుకుంటాం



రాష్ట్రంలో ప్రజలకు ఎక్కడ కష్టం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుంది. వరద ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సీఎంతో పాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు ఎక్కడిక్కడి ప్రభుత్వం ఆదేశాలతో సహాయక చర్యలు చేపట్టారు. ప్రజల బాధలను ప్రత్యక్షంగా చూడాలని సీఎం వచ్చి ఆదుకోవడం మాకు గర్వంగా ఉంది. మేమంతా ప్రజల మనుషులం. ప్రజల సమస్యలను పరిష్కరించడమే మా పని.

– మహేష్‌కుమార్‌గౌడ్, పీసీసీ అధ్యక్షుడు



కామారెడ్డి జిల్లా జీఆర్ కాలనీలో కాలినడకన తిరుగుతున్న సీఎం రేవంత్ రెడ్డి, తదితరులు



జీఆర్ కాలనీలో ప్రజలకు అభివాదం చేస్తూ..



సీఎం రాకతో జిల్లా కేంద్రంలో దేవివిహార్ వద్ద కిలోమీటర్ మేర నిలిచిపోయిన వాహనదారులు

సీఎం పర్యటన సైడ్‌లైట్స్..

కామారెడ్డి టౌన్:

- మధ్యాహ్నం 1: 30 గంటల నుంచి జీఆర్ కాలనీలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు సీఎంకు స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు.
- 2 : 30 గంటలకు ప్రత్యేక బస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి, ఎమ్మెల్యేలు జీఆర్ కాలనీకి చేరుకున్నారు. వరద బాధితులు లింగం, ఆయన కూతురు దివ్యాంగురాలితో సీఎం మాట్లాడి వరద కష్టాలను అడిగి తెలుసుకున్నారు.
- 2: 41 గంటలకు కాలనీలో ఏర్పాటు చేసిన ప్రచార వాహనం ఎక్కారు. మీడియానుద్దేశించి మొదటగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడారు.
- 2: 44కి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్, మంత్రి సీతక్క ఒకరి తర్వాత ఒకరు ప్రసంగించారు.
- 2: 52కి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించారు. 3 గంటలకు ప్రసంగం ముగించారు.
- 3: 03కి ప్రత్యేక బస్సులో సీఎం కలెక్టరేట్‌కు జాతీయ రహదారి మీదుగా బయలుదేరారు.
- 3: 16కి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు.
- 3: 30కి కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో అధికారులతో సమీక్షా సమావేశం ప్రారంభించారు.
- 5: 30కి సమావేశం ముగించారు. మీడియాతో 5: 31కి మాట్లాడారు.
- 5: 41కి కలెక్టరేట్ నుంచి సీఎం ఎస్పీ కార్యాలయానికి బయలు దేరారు.
- 5: 50కి హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలు దేరారు.



కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం లింగంపల్లి కుర్దు బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



కలెక్టరేట్‌లో జరిగిన సీఎం సమీక్షలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, పోలీసులు

సీఎం పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్ట్‌లు



తాడ్వాయిలో నిరసన తెలుపుతున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

తాడ్వాయి: జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో గురువారం రాత్రి బీఆర్ఎస్, బీజేపీ, భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు, రేషన్ డీలర్లను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. తాడ్వాయి సింగిల్ విండో చైర్మన్ కపిల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలులను అరెస్టు చేయడంతో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు.

బీకేఎస్ నేతల నిరసన..

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డిని అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న రైతులు శుక్రవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి నిరసన తెలిపారు. భారతీయ కిసాన్ సంఘ్ క్రమశిక్షణ కలిగిన సంఘమని, ఏ నిరసన కార్యక్రమమైనా చట్టబద్ధంగా చేస్తామని పేర్కొన్నారు. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడిని అరెస్ట్ పేరుతో వేధించడం రైతులను అవమానించడమేనన్నారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు ఆయనను విడుదల చేశారు.

రైళ్లను పొడిగించండి



నిజామాబాద్ అర్బన్: పలు రైళ్లను నిజామాబాద్ మీదుగా పొడిగించాలని సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ జోనల్ స్థాయి సభ్యులు రావులపల్లి జగదీశ్వర రావు కోరారు. సికింద్రాబాద్‌లో గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన హాజరై సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ పలు వినతులు అందించారు. నాందేడ్ వరకు వస్తున్న వందే భారత్ రైలును నిజామాబాద్ వరకు పొడిగించాలన్నారు.తిరుపతికి వందే భారత్ సౌక ర్యం కల్పించాలన్నారు. ఆర్మూర్, డిచ్‌పల్లి మధ్య ట్రాక్ లింకు కలిపించి రైల్వే బైపాస్ నివారించి భూసేకరణలో ప్లాట్ల యజమాన్లకు న్యాయం చేయాలన్నారు. తపోవన్ ఎక్స్‌ప్రెస్, పూణే, ముంబై ఎక్స్‌ప్రెస్‌లను, బెంగుళూరు, ఢిల్లీ రైళ్లను నాందేడ్ నుంచి నిజామాబాద్ వరకు పొడిగించాలన్నారు. ముంబై సికింద్రాబాద్ మధ్య మరొక రైలు నడపాలన్నారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్, సీసీ కెమెరాలు స్కానింగ్ ప్రయాణికుల వసతులు తదితర వాటిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రయాణికుల భద్రత చర్యలు తీసుకోవాల ని కోరారు. జనరల్ మేనేజర్ వాటిని సానుకూలంగా విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సాఫీగా స్వామిని సాగనంపుదాం

ఎల్లారెడ్డి: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజిస్తున్న భక్తులు గణనాథుడిని శనివారం వీడ్కోలు పలకనున్నారు. నిర్లక్ష్యం వహించకుండా తాము చెప్పిన సూచనలు, జాగ్రత్తలు వహించి సాఫీగా, క్షేమంగా స్వామి వారిని సాగనంపుదామని అధికారులు మండపాల నిర్వాహకులకు కోరుతున్నారు. పండుగ కంటే ఒకరోజు మొదలు ఆగస్టు 25న కామారెడ్డి మీదుగా సిరిసిల్లకు తరలి వెళ్తున్న భారీ వినాయక విగ్రహం విద్యుత్ వైర్లకు తగిలి ఒక యువకుడు మృతి చెందడం..అదే నెల 18న హైదరాబాద్ రామంతపూర్‌లో కృష్ణాష్టమి వేడుకల ఊరేగింపులో విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు వ్యక్తులు మృతి చెందిన ఘటనలతో అప్రమత్తమైన విద్యుత్‌శాఖ గణేశ్ మండపాల నిర్వహణ విషయమై పలు జాగ్రత్తలు, సూచనలు జారీ చేసింది. తల్లి గంగమ్మతో కలసి వచ్చిన గణపయ్య నవరాత్రి ఉత్సవాలలో దాదాపు ప్రతి రోజూ వర్షాలు పడ్డా విద్యుత్ శాఖ తీసుకున్న జాగ్రత్తల వల్ల జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదాలు జరగలేదని ఆ శాఖ అధికారులు అంటున్నారు. శనివారం జరుగనున్న నిమజ్జన కార్యక్రమం కూడా..కావాల్సిన జాగ్రత్తలు తీసుకొని ప్రశాంతంగా జరుపుకోవాలని పలు శాఖల అధికారులు అంటున్నారు.

నిమజ్జనం సందర్భంగా పలు శాఖలు జారీ చేస్తున్న సూచనలు, జాగ్రత్తలివే...

- వినాయక నిమజ్జన యాత్రకు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం అతుకులు లేని నాణ్యమైన విద్యుత్ సర్వీస్ వైర్లను ఉపయోగించాలి.
- నైపుణ్యం లేని ఎలక్ట్రిషియన్లతో లేదా సొంతంగా విద్యుత్ కనెక్షన్లు ఇద్దామని ప్రయత్నించొద్దు.
- విద్యుత్ సరఫరా చేసే బోర్డులను పిల్లలకు అందనంత ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలి. మెయిన్ లైన్లకు లూప్‌లు వేసి విద్యుత్ సరఫరా తీసుకోవద్దు.
- ఎత్తయిన విగ్రహాలు తరలించేటప్పుడు మెయిన్ లైన్ వైర్లకు తగలకుండా చర్యలు తీసుకోవాలి. శోభాయాత్రలో విగ్రహాలు పడిపోకుండా కట్టే కర్రలు, రాడ్లు విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.
- విగ్రహాలను తరలించే వాహనం డ్రైవరు మద్యం తాగి ఉన్నాడా అని పరిశీలించాలి.
- నిమజ్జన యాత్రలో రోడ్డుకు అడ్డుగా వచ్చే విద్యుత్, కేబుల్ తీగల పట్ల జాగ్రత్తలు వహించాలి.
- విగ్రహాలను వాహనాల పైకి ఎక్కించే సమయంలో విద్యుత్ వైర్లు లేని ప్రదేశాలలోనే విగ్రహాలను ఎక్కించాలి. విద్యుత్ మెయిన్ లైన్లు పోతున్న చోట విగ్రహాలను ఎక్కించొద్దు.

రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు తరలిన క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: నిర్మల్‌లో ఈ నెల 5 నుంచి 7 వరకు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల యోగాసన పోటీలు జరుగనున్నాయి. ఈనేపథ్యంలో నిజామాబాద్ జిల్లా నుంచి 20 మంది యోగా క్రీడాకారులు గురువారం నిర్మల్ తరలివెళ్లారు. జిల్లా జట్టుకు కోచ్‌గా ఉమారాణి, శివ కుమార్ వ్యవరిస్తున్నారు. వీరితోపాటు టెక్నికల్ అఫీషియల్స్‌గా ఎంపికైన ఏడుగురు జిల్లా నుంచి వెళ్లారు. అంతకుముందు క్రీడాకారులను జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు యోగా రాంచందర్, ప్రతినిధులు గంగాధర్, జ్యోతి, రసజ్ఞ అభినందించారు.

తండ్రి వద్దు.. పింఛన్ కావాలి

- పెన్షన్ డబ్బులను తీసుకొని తండ్రిని వదిలేసిన కూతురు
- కుమారుడికి ఫోన్ చేసి తండ్రిని తీసుకెళ్లాలని సూచించిన ఎస్సై



తుంకిపల్లి గ్రామ పంచాయతీ వద్ద పోచయ్య

నిజాంసాగర్(జుక్కల్): ఓ కూతురు తన తండ్రికి వచ్చే పింఛన్ డబ్బులు తీసుకొని, తండ్రిని వదిలేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లి గ్రామానికి చెందిన ఎరుకల పోచయ్య, దుర్గవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. దుర్గవ్వ, ఒక కొడుకు కొన్నేళ్ల కిందట మృతి చెందారు. మరో కొ డుకు నారాయణ పెళ్లి చేసుకొని ఇల్లరికం వెళ్లాడు. అప్పటి నుంచి వృద్ధుడైన పోచ య్య నిజాంపేటలోని కూతురు నర్సవ్వ వద్ద ఉంటున్నాడు. నాల్గు రోజుల కిందట తండ్రి పింఛన్ కోసం నర్సవ్వ తన తండ్రిని తీసుకొని తుంకిపల్లి గ్రామ పంచాయతీకి వచ్చింది. సిబ్బంది డబ్బులు ఇవ్వకపోవడంతో తండ్రిని అక్కడే వదిలివేసి వెళ్లిపోయింది. దీంతో పోచయ్య గ్రామ పంచాయతీ వద్దనే ఉన్నాడు. బుధవారం జీపీ కా ర్యాలయం వద్ద పోస్టాఫీసు సిబ్బంది పింఛన్ పంపిణీ చేస్తుండటంతో నర్సవ్వ వచ్చి, పింఛన్ డబ్బులను తీసుకొని తండ్రిని అక్కడే వదిలేసి వెళ్లింది. పోచయ్య అనాథగా మారి రోధించడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఎస్సై శివకుమార్‌కు సమాచారం అందించారు. కూతురుకు ఎస్సై ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. కుమారుడికి ఫోన్ చేసి తండ్రిని తీసుకువెళ్లాలని చెప్పారు.

వంతెనలకు పట్టిన గ్రహణం



పద్మాజీవాడి-కల్వరాల్ గ్రామాల మధ్య మట్టి కొట్టుకుపోగా మిగిలిపోయిన వంతెన


- ఇరువైపులా కోతకు గురైన రోడ్లు
- పద్మాజీవాడి-కల్వరాల్ గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇరు గ్రామాల ప్రజలు
- ప్రమాదకరంగా తిర్మన్‌పల్లి తుంగాగు బ్రిడ్జి



కోతకు గురైన తిర్మన్‌పల్లి తుంగాగు వంతెన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి-కల్వరాల్ గ్రామాల మధ్య గతంలో నిర్మించిన వంతెనకు మళ్లీ గ్రహణం పట్టుకుంది. కొన్ని సంవత్సరాలు వంతెన కోసం అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకోగా ఐదేళ్ల క్రితం వంతెన నిర్మాణం జరిగింది. ఇటీవల కురిసిన అకాల వర్షానికి బ్రిడ్జికి ఇరు వైపులా వేసిన మట్టి వరద ఉధృతికి పూర్తిగా కొట్టుకుపోవడంతో కేవలం వంతెన మిగిలింది. దీంతో ఈ రెండు గ్రామాలకు రాకపోకలు తెగిపోయాయి. ఈ బ్రిడ్జి నిర్మించడం వల్ల రెండు గ్రామాల ప్రజలకు కొంత సౌకర్యంగా ఉండేది. రైతులకు దూర భారం తగ్గింది. కానీ మట్టి పూర్తిగా కొట్టుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే మండల కేంద్రం శివారు– తిర్మన్‌పల్లి మధ్య గల తుంగాగు వద్ద నిర్మించిన వంతెన వరద ఉధృతికి బుంగ ఏర్పడడంతో బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డు గుండా రామారెడ్డి, మాచారెడ్డి మండలాలకు వాహనాదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రధాన రహదారిపై వంతెన ప్రమాదకరంగా మారినప్పటికి ఇప్పటి వరకు అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పరిస్థితిని పట్టించుకునే నాథుడు లేకుండా పోయారని వారు వాపోతున్నారు. ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అని ప్రజలు ఆగ్రహానికి గురవుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం



చిన్నికృష్ణుడి పొలంలో సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ రూరల్: ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం లభిస్తుందని సీపీ సాయి చైతన్య అన్నారు. మండలంలోని గూపన్‌పల్లి శివారులో సేంద్రియ పద్ధతి ద్వారా సాగు చేస్తున్న చిన్ని కృష్ణుడి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం సీపీ సందర్శించారు. అనంతరం చిన్ని కృష్ణుడితో మాట్లాడి సేంద్రియ సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. 22 వంగడాలతో ఏర్పాటు చేసిన సూచన చక్రాన్ని, 23 వంగడాలతో చిన్ని కృష్ణుడి వివరాలను ఏర్పాటు చేసిన తీరును అభినందించారు. సీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన పంటలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. యువత సైతం సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని అన్నారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

డీజే నిర్వాహకుల అరెస్టు

భిక్కనూరు: నిబంధనలకు వ్యతిరేకంగా వినాయక నిమజ్జనంలో డీజేలను వినియోగించినందుకు డీజే యజమానులతోపాటు వినాయక మండపాల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు గురువారం తెలిపారు. మండలంలోని భాగిర్తిపల్లి, అయ్యవారిపల్లిలో డీజేలను వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు ఆయా గ్రామాలకు వెళ్లగా డీజేలు వినియోగించి రోడ్డుపై నృత్యాలు చేస్తున్న పలువురిని గుర్తించామన్నారు. భాగిర్తిపల్లిలో డీజేని అద్దెకు ఇచ్చిన వేములవాడకు చెందిన డీజే యజమానిపై, అయ్యవారిపల్లిలో డీజేను అద్దెకు ఇచ్చిన మెదక్ జిల్లా తిప్పనగుల్లకు చెందిన డీజే యజమానిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే ఆయా వినాయక మండపాల నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

డీజేల సీజ్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు డీజేలను సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఆర్మూర్‌లోని రెండు వినాయక మండపాల వద్ద, ఫత్తేపూర్‌లో ఒకచోట డీ జేలు ఏర్పాటు చేయగా వాటిని సీజ్ చేసి, నిర్వా హకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా పలువురు మ ద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం కౌన్సెలింగ్ అనంతరం పోలీసు లు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చా రు. జడ్జి వారిలో 9 మందికి రూ.12వేల జరిమానా విధించగా, ఆరుగురికి 2 రోజులు, ఇద్దరికీ 3 రోజు ల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్: మండలంలోని నాగన్‌పల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బోధన్‌రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి గురువారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్యలో ఉంటుందని ఆయన తెలిపారు. జీపీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

తాళం వేసిన నాలుగిళ్లల్లో చోరీ

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ గ్రామంలో తాళం వేసిన నాలుగిళ్లల్లో చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఆకుల బాలమణి, అవుసుల రేఖ, మెకానిక్ సత్యం, కన్నపురం రాజయ్య వారి ఇళ్లకు తాళాలు వేసి, వేరే ఊర్లకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి, ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఉదయం స్థానికులు చోరీలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నాలుగిళ్లల్లో సుమారు రూ.రెండు లక్షల విలువ గల బంగారు, వెండి వస్తువులను దుండగులు అపహరించినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.